సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
మంగళవారం । 30 । జనవరి । 2024



సాగులో 'ఆణిముత్యం'

ముత్యాల సాగులో ఆణిముత్యంలా పేరుగాంచాడు తాడిపత్రికి చెందిన నాగరాజు. రెండేళ్లకే రూ.6 లక్షల దిగుబడి తీసి ఔరా అనిపించాడు.

8లో



టమాట కిలో రూ.18

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 33.7°/13.9°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు హిందూపురంలో జాబ్ మేళా



హిందూపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం ఈనెల 30న హిందూపురంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలో మెడ్‌ప్లస్ ఫార్మసీ, క్యాలిబర్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ హరీష్, జిల్లా నైపుణ్యాధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. ఇంటర్, డిగ్రీ, బి. ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు హాజరు కావొచ్చన్నారు. ఎంపికైన వారు హిందూపురం, ధర్మవరం, అనంతపురం, బెంగళూరు ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని, వేతనం రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు, విద్యార్హత పత్రాలు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 9959419089 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఫైరింగ్ రేంజ్ స్థల పరిశీలన



ఫైరింగ్ రేంజ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఆర్ ఏఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి సమీపంలో జిల్లా పోలీసుశాఖ ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు కోసం నిర్ణయించిన స్థలాన్ని ఏఆర్ ఏఎస్పీ విజయ్ కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీసులకు ఫైరింగ్‌లో శిక్షణ, తర్ఫీదు ఇచ్చేందుకు స్థలం అనువుగా ఉందన్నారు. ఈ స్థలాన్ని బ్రిటీష్ వారి కాలంలోనే పోలీస్ శాఖకు కేటాయించటం సంతోషంగా ఉందన్నారు.

సజావుగా వీఏహెచ్‌ఏ సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ (వీఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా రెండో విడతలో అర్హత పొందిన 240 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనంతపురంలోని పశుశాఖ జేడీ కార్యాలయంలో అభ్యర్థుల సర్టిఫికెట్లను రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ శుభదాస్ సమక్షంలో డీడీలు డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, డాక్టర్ సత్యరాజ్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ టి.సుధాకర్ నేతృత్వంలో పలువురు ఏడీలు, పశువైద్యులు, క్లరికల్ స్టాఫ్‌తో కూడిన ఆరు బృందాలు నిశితంగా పరిశీలించాయి. ఉమ్మడి జిల్లాలో 473 పోస్టులకు 919 మంది అభ్యర్థులు గత నెల 31 ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన విషయం తెలిసిందే. డైరెక్టరేట్ పరిధిలోనే మెరిట్, రోస్టర్, కటాఫ్ మార్కులు ఆధారంగా తొలివిడతలో 206 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, సర్టిఫికెట్ల పరిశీలనలో 205 మంది పోస్టులు దక్కించుకున్నారు. తాజాగా రెండో విడత కింద 240 మంది అభ్యర్థులకు సంబంధించి సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన సజావుగా సాగింది. ఇప్పటికే పనిచేస్తున్న వీఏహెచ్‌ఏల బదిలీలు పూర్తి చేసి బుధవారం కొత్త వారికి పోస్టింగ్ ఇవ్వనున్నారు.

రహదారి చుట్టూ రాజకీయం

ధర్మవరంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణం

- రూ.4 కోట్లు మంజూరు చేసిన జగన్ ప్రభుత్వం
- టెండర్ ప్రక్రియ పూర్తి.. నేటి నుంచి పనులు ప్రారంభం
- సొంత డబ్బుతో రోడ్డు వేస్తామంటూ ప్రతిపక్షాల డ్రామా
- టీడీపీ హయాంలో వేసిన నాసిరకం రోడ్డుతోనే అవస్థలు

ధర్మవరం: ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీలు ప్రతి అంశాన్నీ రాజకీయం చేస్తున్నాయి. ముఖ్యంగా ధర్మవరంలో ఈ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. తాము చేసిన తప్పును అధికార పార్టీపై తోసి వేసేందుకు సిద్ధమయ్యాయి. ఈక్రమంలో పట్టణంలోని ప్రధాన రోడ్డును ప్రతిపక్షాలు ఓటు లబ్ధికి వాడుకుంటున్నాయి. టీడీపీ హయాంలో కమీషన్లకు కక్కుర్తిపడి వేసిన నాసిరకం రోడ్డు పాడై పోగా, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్షాలన్నీ నానాపాట్లు పడుతున్నాయి. నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిసి ఆయా పార్టీల నేతలు నీచ రాజకీయానికి తెర లేపారు. టెండర్లు కూడా పూర్తయ్యాక తామే సొంత నిధులతో రోడ్డు వేస్తామని ప్రకటనలు చేస్తూ జనం వద్ద క్రెడిట్ కొట్టేయాలని చూస్తున్నారు.





ధర్మవరం పట్టణంలో ఫోర్ లేన్ రహదారి నిర్మాణం కోసం కొలతలు వేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు, ధర్మవరం పట్టణంలోని ప్రధాన కూడలి

ఏడాదికే గుంతలమయం..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారి నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి కమీషన్లకు కక్కుర్తి పడటంతో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేశారు. ఫలితంగా ఏడాది తిరగక ముందే తారు మొత్తం కరిగిపోయి కంకర తేలి రోడ్డు గుంతలమయం అయ్యింది. దీంతో ఈ దారిపై ప్రయాణం నరకం కాగా, ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఎమ్మెల్యే చొరవతో రూ.4 కోట్లు విడుదల..

పట్టణంలో ప్రధాన రహదారి దెబ్బతిని ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సమస్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అత్యవసరంగా రోడ్డు వేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన సీఎం వైఎస్ జగన్ ధర్మవరం పట్టణంలో ప్రధాన రహదారిని నాలుగు వరుసల్లో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతే కాకుండా రూ.4 కోట్లు నిధులు విడుదల చేస్తూ 2023 డిసెంబర్ 5వ తేదీన జీఓ సైతం జారీ చేశారు. దీంతో అధికారులు రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారం..

టీడీపీ హయాంలో దెబ్బతిన్న రోడ్డు స్థానంలో వైఎస్ జగన్ ప్రభుత్వం నూతనంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో ప్రతిపక్ష టీడీపీ, బీజేపీలు దుష్ప్రచారం మొదలు పెట్టాయి. ఎల్లో మీడియా అండతో గుంతలమయమైన రోడ్డు అంటూ ప్రభుత్వంపై బురదజల్లుతూ ప్రచారం తీవ్రతరం చేయించారు. ఇక మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి అయితే మెగా డ్రామా మొదలు పెట్టారు. స్వతహాగా కాంట్రాక్టర్ అయిన సూరి... రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం, టెండర్ ప్రక్రియ పూర్తయిన విషయం తెలుసుకుని కొత్త నాటకానికి తెరతీశారు. తాను సొంత డబ్బుతో రోడ్డు వేయిస్తానని, ఇందుకు అనుమతి ఇవ్వాలంటూ ఆర్‌అండ్‌బీ అధికారులకు వరుసగా వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. అయితే రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాటు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిందని చెప్పినా..సూరి మాత్రం ఎల్లో మీడియా ఎదుట మొసలి కన్నీరు కారుస్తూ నాటకం రక్తికట్టించారు. రోడ్డు తానే వేస్తున్నానని చెబుతూ క్రెడిట్ కొట్టేయాలని నానా పాట్లు పడుతున్నారు. అన్నీ తెలిసిన జనం ఈ పబ్లిసిటీ స్టంట్ చూసి విస్తుపోతున్నారు.

6.62 కి.మీ మేర బీటీరోడ్డు

ధర్మవరం పట్టణంలో నాలుగు వరుసల ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం నుంచి పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. మండల పరిధిలోని నాగలూరు నుంచి పట్టణంలోని ఎర్రగుంట వై జంక్షన్ వరకు 6.62 కి.మీ పరిధిలో బీటీరోడ్డు వేసేందుకు సిద్ధమయ్యారు. అంతేకాక రహదారి నిర్మాణంలో వదులు నేల ఉన్న ప్రాంతంలో అక్కడక్కడా సీసీరోడ్డు వేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



పట్టణంలోని ప్రధాన రహదారి గుంతలమయమైంది. ఈరోడ్డుపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి చొరవ తీసుకుని రూ.4 కోట్లతో నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తెచ్చారు. పనుల ప్రారంభానికి చర్యలూ చేపట్టారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య కూడా తీరుతుంది. రహదారి నిర్మాణానికి చొరవ చూపిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. – చెన్నంపల్లి తిరుమల, ధర్మవరం.

రాజకీయం తగదు



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ధర్మవరం పట్టణంలో రోడ్డు వేశారు. నాసిరకం పనుల వల్ల పది నెలలు గడవక ముందే అది శిథిలావస్థకు చేరింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఎమ్మెల్యే కేతిరెడ్డి విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నాలుగు వరుసల రహదారి మంజూరయ్యేలా చూశారు. రూ.4 కోట్లతో రహదారిని నిర్మిస్తున్నారు. దీన్ని తెలుసుకున్న ప్రతిపక్షాలు రహదారి చుట్టూ రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూడటం దారుణం. – చందమూరి నారాయణరెడ్డి, ధర్మవరం

నేటి నుంచి రోడ్డు పనులు

ధర్మవరం పట్టణంలో నాలుగు వరుసల ప్రధాన రహదారిని నిర్మించే పనులు మంగళవారం (ఈనెల 30) ప్రారంభిస్తున్నాం. ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తి చేశాం. రూ.4 కోట్ల వ్యయంతో నాగలూరు నుంచి ఎర్రగుంట వై జంక్షన్ వరకూ రోడ్డు నిర్మిస్తున్నాం. భారీ వాహనాలు ప్రయాణించినా రోడ్డు పాడవకుండా పూర్తి నాణ్యతతో పనులు చేయిస్తున్నాం. – నాగ పుల్లమరావు, డీఈ, రోడ్లు, భవనాల శాఖ

డబుల్ ఎంట్రీలు తొలగించండి

- జేసీ అభిషేక్ కుమార్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

హిందూపురం: ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీ, మరణించిన వారి పేర్లు ఉంటే వెంటనే తొలగించాలని జేసీ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కొత్త ఓటర్లుంటే నమోదు చేయాలన్నారు. సవరణలుంటే కూడా చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమములో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చింతపండు @ 26,525



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: చింతపండు ధరలు మార్కెట్‌లో ఆశాజనకంగా ఉన్నాయి. హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 788 క్వింటాళ్ల చింతపండును రైతులు, చిల్లర వ్యాపారులు తీసుకురాగా.. ఈ–నామ్ పద్ధతిలో వేలం వేశారు. కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్ఠంగా రూ.26,525, రూ.కనిష్ఠంగా 8,050, సగటున రూ.15,000 మేర పలికింది. ఇక ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్ఠంగా రూ.11,000, కనిష్ఠంగా రూ.4,000, సగటున రూ.5,500 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

- కుల గణన సర్వే త్వరగా పూర్తి చేయాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: 'స్పందన' కార్యక్రమంలో అందే అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 298 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి ఆయా శాఖలకు పంపారు. అనంతరం స్పందన హాలు నుంచే అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల స్థాయి అధికారులంతా స్పందన అర్జీల పరిష్కారం కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. నిర్దేశిత సమయంలో అన్నింటినీ పరిష్కరించాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కులగణన సర్వే వివరాలు పరిశీలించాలి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కార్యక్రమంలో వలంటీర్లదే కీలక పాత్ర అని కలెక్టర్ అన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు కుల గణనపై చొరవ చూపాలన్నారు. సర్వేతో పాటు ప్రభుత్వ పథకాల అమలు, లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకూ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి 85 శాతం సర్వే పూర్తి చేశారని, ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకూ మిగిలిపోయిన కుటుంబాలను సర్వే చేయాలన్నారు. సర్వే నివేదికలను డివిజన్ స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియపై ఎంపీడీఓలకు, తహసీల్దార్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నోడల్ ఆఫీసర్‌కు సూచించారు. ఫిబ్రవరి 2 నుంచి 15వ తేదీ వరకూ డేటాను పరిశీలించి జాబితా సిద్ధం చేయనున్నట్లు చెప్పారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

'గడప గడపకూ' పనులు గ్రౌండింగ్ చేయండి

ఆసరా, చేయూత తదితర పథకాల అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రగతి సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. 'గడప గడపకూ' కార్యక్రమంలో మంజూరైన పనులను త్వరగా గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇంటి పట్టాల వివరాలను లాగిన్‌లో అప్‌లోడ్ చేసి సరిహద్దులను చూపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ భాగ్యరేఖ, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో అందిన అర్జీల్లో కొన్ని ఇలా...

- రేషన్ కార్డులో పేరు తప్పుగా ముద్రించడంతో తనకు ఏ ప్రభుత్వ పథకం వర్తించడం లేదని, సమస్యను పరిష్కరించాలని అమరాపురం మండలం హాలకూరు పంచాయతీకి చెందిన నాగమణి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- తమ గ్రామ సర్వే నంబర్ 1–2లో 53.41 ఎకరాల భూమి ఉమ్మడి ఆస్తిగా ఉందని, దీన్ని 24 మంది రైతులం సాగుచేసుకుంటామని చిలమత్తూరు మండలం పలకలపల్లి గ్రామానికి చెందిన మహిళా రైతు పల్లా ఆదెమ్మ కలెక్టర్‌కు తెలిపారు. ఈ భూమిని సమ భాగాలుగా చేసి తన వాటాకు హద్దులు చూపాలని కోరారు.
- గోరంట్ల మండలం సోమగట్టలో దళితులకు శ్మశాన వాటికకు భూమిని కేటాయించాలని సర్పంచ్ నరసింహులు ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. గ్రామ సమీపంలోనే భూమి ఉందని, దాన్ని కేటాయించాలని చాలాకాలంగా రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

తొలి విడత కులగణన పూర్తి

- 5.35 లక్షల కుటుంబాల నమోదు
- ఫిబ్రవరి 2వ తేదీలోపు మిగిలిన కుటుంబాల సర్వే

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే మొదటి విడత ముగిసింది. ప్రభుత్వం నిర్దేశించిన గడువు 10 రోజుల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి 85 శాతం మేర సర్వే పూర్తి చేసినట్లు గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి తెలిపారు. కుటుంబ యజమానితో వేలి ముద్ర తీసుకొని ఆ కుటుంబ సభ్యుల కులం, విద్యార్హత, తదితర వివరాలను నమోదు చేశారన్నారు.

5,35,199 కుటుంబాల సర్వే పూర్తి..

కుల గణన ప్రక్రియ ఈనెల 19 జిల్లా ప్రారంభమైంది. జిల్లాలో 6,17,784 కుటుంబాలు ఉండగా, 18,69,478 మంది జనాభా ఉన్నారు. కులగణన తొలి విడతలోనే 5,35,199 కుటుంబాలకు చెందిన 14.54 లక్షల మంది వివరాలను సేకరించారు. ఈ ప్రక్రియలో జిల్లాలోని 5440 మంది సచివాలయ ఉద్యోగులు, 9,851 మంది వలంటీర్లు పాల్గొన్నారు. కులగణన ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్‌లో చేపట్టేందుకు గ్రామ/వార్డు సచివాలయాలశాఖ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సర్వేలో భాగంగా ఓ ఇంటికి వెళ్లి సదరు యాప్‌ను ఓపెన్ చేయగానే అందులో కులాల వారీగా వివరాలు అందుబాటులోకి వస్తాయి. కుటుంబ సభ్యులు చెప్పే వివరాల మేరకు కుల గణన ప్రక్రియ పూర్తి చేశారు.

ఫిబ్రవరి 2 వరకూ సర్వే..

వివిధ కారణాలతో ఇంటి వద్ద లేని వారి కోసం ప్రభుత్వం ఫిబ్రవరి 2వ తేదీ వరకూ సర్వేను కొనసాగించనుంది. ఇంటింటి సర్వేలో నమోదుకాని కుటుంబాలను వలంటీర్లు గుర్తించుకొని మరోసారి ఆయా కుటుంబాలను సందర్శించి వివరాలు నమోదు చేయాలని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 15వ తేదీ వరకూ డివిజన్ స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు కులగణన డేటాను పరిశీలించి జాబితా సిద్ధం చేస్తారు.



కనగానపల్లి మండలం ముక్తాపురంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అలివేలమ్మ

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి



కులగణనలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి. ఇందుకోసం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మరింత వేగంగా పనిచేయాలి. ఇప్పటికే జిల్లాలోని 85 శాతం కుటుంబాల సర్వే పూర్తయ్యింది. మరో 5 రోజుల్లో మిగతా కుటుంబాలను సర్వే చేస్తాం. – అరుణ్‌బాబు, కలెక్టర్

బాలల బీమాతో భరోసా

- ప్రమాదవశాత్తు మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు ఆసరా
- రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో అమలు
- ఈ ఏడాది ప్రీమియం చెల్లింపునకు 31వ తేదీ తుది గడువు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వారిలో నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన పిల్లలే అధికం. విధి వక్రించి ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే తల్లిదండ్రులు కడుపుకోతతో దిక్కుతోచని స్థితిలో మానసిక సంఘర్షణకు లోనవుతారు. ఓ వైపు ఆర్థిక భారమైన ఆ కుటుంబాలు, మరోవైపు గుండె కోతకు గురైతే పోయిన బిడ్డలను తెచ్చివ్వలేము. కానీ కొంతలో కొంతగా అండగా ఉంటే వారి కుటుంబాలకు ఆసరా ఉంటుందనే మంచి ఆలోచనతో 'బాలల బీమా' పథకం అమలు చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్, ఆదర్శ పాఠశాలలు, కస్తూరిబా బాలికా విద్యాలయాలు, నవోదయ, కేంద్రీయ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

ప్రీమియం చెల్లింపు ఇలా...

విద్యార్థులు చెల్లించాల్సిన ప్రీమియం ప్రారంభంలో ఒక్కొక్కరు ఏడాదికి రెండు రూపాయలు. రెండో సంవత్సరం (2011–12) నుంచి ప్రీమియం రూ.2 నుంచి రూ.5కు పెంచారు. ప్రమాదవశాత్తూ అంటే రోడ్డు ప్రమాదాలు, నీటమునక, విద్యుదాఘాతం, పాము, తేలు, కుక్కకాటు తదితర కారణాలతో మరణించినా, వైకల్యం బారిన పడినా బీమా మొత్తం పొందేందుకు అర్హులు. చనిపోయినా, పూర్తి వైకల్యం చెందినా రూ.25 వేలు, కొంతమేర వైకల్యం చెందితే రూ.10 వేలు బీమా మంజూరవుతుంది. హెచ్‌ఎం తమ పాఠశాలలో నమోదైన ప్రతి విద్యార్థి నుంచి బీమా ప్రీమియం సేకరించి సంబంధిత ఎంఈఓ ద్వారా సమగ్ర శిక్ష కార్యాలయానికి అందేలా చూడాలి. వారు ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే పాఠశాల హెచ్‌ఎం ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు విషయాన్ని చేరవేస్తే బీమా మొత్తం వెంటనే వచ్చేందుకు సులువవుతుంది.

31లోగా ప్రీమియం చెల్లించాలి

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉంది. ప్రతి విద్యార్థి నుంచి ప్రీమియం చెల్లించేలా పాఠశాల హెచ్‌ఎం, ఎంఈఓలు చర్యలు తీసుకోవాలి. హెచ్‌ఎం సకాలంలో ప్రీమియం చెల్లించేలా చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఈవీఎంలపై అవగాహన అవసరం



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌ఓ కొండయ్య పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలతోనే ఓటు వేస్తామన్నారు. వీటిపై అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవాలన్నారు. మండల కేంద్రాల్లోనూ ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈడీటీ మైనుద్దీన్, సిబ్బంది జగన్నాథ్, నాగేంద్ర ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జేసీ, ఉద్యోగులు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రూపొందించిన 2024 వార్షిక క్యాలెండర్‌ను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉద్యోగులు రథచక్రాల్లాంటివారన్నారు. అంకిత భావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్, తాలూకా అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, గౌరవాధ్యక్షులు ఫక్రుద్దీన్, వైస్ ప్రెసిడెంట్లు చంద్రానాయక్, చంద్రకళ, ట్రెజరర్ నిరంజన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలు మల్లికార్జున, లక్ష్మయ్య, సూర్యనారాయణ, రమణారెడ్డి, కాటమయ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం వేడుక



స్వామికి గంధం సమర్పించిన పీఠాధిపతి

పెనుకొండ: పట్టణంలోని హజ్రత్ సయ్యద్‌షా బాబా మెయినుద్దీన్ దర్గాలో గంధం వేడుకను ఆదివారం అర్ధరాత్రి ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సయ్యద్ ఇబ్రహీం హుస్సేని కుమారుడు సయ్యద్ అంజు ఇంటి వద్ద నుంచి గంధాన్ని తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ నక్కరాళ్లతండాకు చెందిన మూడే గోపాల్‌నాయక్ (48) అనే వ్యక్తి సోమవారం మృతి చెందాడు. వివరాలు... మూడు రోజుల క్రితం ఈతోడు టవర్ సమీపంలో గుర్తు తెలియని వాహనం గోపాల్ నాయక్‌ను ఢీ కొనడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రున్ని చికిత్స కోసం అనంతపురం, అక్కడి నుంచి మెరుగైన చికత్స కోసం బెంగళూరుకు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గోపాల్‌నాయక్ మృతి చెందాడు. మృతునిరి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

సాగులో ఆణి‘ముత్యం’

సంప్రదాయ పంటల సాగుతో ఆ రైతు విసుగెత్తాడు. ఏదైనా కొత్త రకం సాగుచేయాలని ఆలోచిస్తున్న తరుణంలో యూట్యూబ్ ఆయనకు దారి చూపింది. ముత్యాల సాగు వైపు నడిపించింది. వేరే రాష్ట్రాల్లో శిక్షణకు వెళ్లేలా పురిగొల్పింది. ఎంతో ఉత్సాహంగా సాగు చేసిన పంట మొదటి సారి నిరాశే మిగిల్చినా, పట్టు వదలని రా‘రాజు’లా పరిశ్రమించిన ఆయనకు లాభాలు తెచ్చిపెట్టింది.



ముత్యాల సాగు చేస్తున్న నీటికుంట



సాగులో ఉన్న ఆల్చిప్పలను చూపుతన్న నాగరాజు

- మంచినీటిలో వినూత్నంగా ముత్యాల సాగు
- పెద్దపొలమడకు చెందిన నాగరాజు వినూత్న ప్రయత్నం
- రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న వైనం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలం పెద్ద పొలమడ గ్రామానికి చెందిన నారాయణమ్మ, నల్లప్ప దంపతుల కుమారుడు నాగరాజుది సాధారణ వ్యవసాయ కుటుంబం. తమకున్న 7 ఎకరాల పొలంలో చాలా కాలం సంప్రదాయ పంటలు సాగు చేసేవారు. నిత్యం వైవిధ్యంగా ఆలోచించే నాగరాజుకు ఇది నచ్చేది కాదు. ఏవైనా వెరైటీ రకాలు సాగు చేసి, 10 మందిలో తనకంటూ ఓ గుర్తింపు పొందాలని తాపత్రయపడేవాడు. ఈ క్రమంలోనే ఒక రోజు తన సెల్‌లో యూట్యూబ్ వీడియోలు చూస్తుండగా, ముత్యాల సాగు గురించి కనిపించింది.

వేరే రాష్ట్రాలకు వెళ్లి.. శిక్షణ తీసుకుని..

ఆ రోజు రాత్రంతా నాగరాజుకు అదే తలంపు. ఎలాగైనా తాను కూడా ముత్యాలు సాగు చేయాలని నిశ్చయించుకున్నాడు. మళ్లీ సెల్‌లో ఆ విషయం గురించి ఆరా తీయడం ప్రారంభించాడు. రాష్ట్రంలో



పండించిన ముత్యాలను చూపుతున్న రైతు

ఎక్కడా ఆ సాగుపై శిక్షణ ఇచ్చేవారు కనిపించలేదు. కలకత్తా, కోయంబత్తూర్ వంటి నగరాల్లో ఇస్తారని తెలుసుకున్నాడు. దీంతో నాగరాజు అక్కడికే వెళ్లాడు. 3 నెలల పాటు శిక్షణ తీసుకున్నాడు. అనంతరం గ్రామానికి తిరిగొచ్చి ఎంతో ఉత్సాహంగా ఇంట్లోనే ముత్యాల సాగు ప్రారంభించాడు.

నష్టాలతో మొదలు..

2017లో దాదాపు రూ. లక్ష వ్యయంతో సాగులో అడుగేసిన నాగరాజుకు నష్టాలే పలకరించాయి. గదిలో తొట్టె ఏర్పాటు చేసి 3 వేల ఆల్చిప్పలు పెంచగా.. దాదాపు 2 సంవత్సరాలకు దిగుబడి వచ్చింది. అయితే, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దగా అనుభవం లేకపోవడంతో ఆశించిన ఫలితం రాలేదు. అయినా, నాగరాజు ఏమాత్రం నిరాశ పడలేదు. తల్లిదండ్రులు కూడా కుమారుడిని ఎక్కడా నిరుత్సాహపరచక ప్రోత్సహించారు. దీంతో నాగరాజు ముత్యాల సాగు కొనసాగించాడు. 2021లో ఎల్-మార్జిలీస్, ఎల్- కొరియన్స్ అనే రకం సాగు ప్రారంభించాడు. తన కష్టానికి తగిన ఫలితం దక్కింది. రెండు సంవత్సరాలకు దిగుబడి వచ్చింది. ఆన్‌లైన్ ద్వారా సూరత్, ఢిల్లీ, కలకత్తా కు చెందిన వ్యాపారులకు ముత్యాలను విక్రయించాడు. ఒక్కో ముత్యం రూ.50 నుంచి రూ. 100 వరకూ అమ్ముడుపోయింది. మేలైన రకాల ముత్యాలకు రూ.500 వరకు విక్రయించాడు. దీంతో దాదాపు రూ. 6 లక్షల ఆదాయం వచ్చింది.

పెద్ద ఎత్తున సాగు..

లాభాలు వరించడంతో ముత్యాల సాగుపై నాగరాజుకు నమ్మకం పెరిగింది. ఈ సారి పెద్ద ఎత్తున సాగుకు ఉపక్రమించాడు. చిన్నపొలమడ వద్ద పెన్నానది సమీపంలో అర ఎకరా స్థలం అద్దెకు తీసుకుని నీటి కుంట ఏర్పాటు చేసుకున్నాడు. తమ ప్రాంతంలో నీరుండే చోట కూడా విత్తన ఆల్చిప్పలు లభిస్తాయని తెలియడంతో తాడిపత్రికి దగ్గర్లో ఉన్న గండికోట రిజర్వాయర్, దగ్గర్లో ఉన్న చిన్నపాటి చెరువుల నుంచి విత్తన ఆల్చిప్పలను సేకరించడం ప్రారంభించాడు. అక్కడి కొందరు మత్స్యకారులను పరిచయం చేసుకుని, ఒక్కో ఆల్చిప్పకు రూ.3 నుంచి రూ. 5 చెల్లించి విత్తన ఆల్చిప్పలను తెచ్చుకున్నాడు. ప్రస్తుతం దాదాపు 30 వేల ఆల్చిప్పలు సాగు చేస్తున్నాడు. వచ్చే ఏడాది దిగుబడి అందుతుందని, మళ్లీ మంచి ఆదాయం రావడం ఖాయమని నాగరాజు తెలిపాడు.

ఆసక్తి ఉన్న వారికి శిక్షణ ఇస్తా..

చిన్నపాటి పెట్టుబడితోనే ముత్యాల సాగులో లాభాలు గడించవచ్చు. వెయ్యి ఆల్చిప్పలు సాగు చేయడానికి కేవలం రూ. 30 వేలు చాలు. బాగా కాపాడుకుంటే రెట్టించిన లాభాలు గడించవచ్చు. ఏదైనా విభిన్న పంటలు చేయాలనే తలంపే నన్ను ఇటువైపు నడిపించింది. ఆన్‌లైన్ ద్వారానే విక్రయాలు చేపడుతున్నా. ముత్యాల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు సంప్రదిస్తే శిక్షణ అందిస్తా.

– నాగరాజు, రైతు, పెద్దపొలమడ

బట్టలూడదీయించి.. నరకం చూపించి

పిల్లల చదివిస్తూ ఆలనాపాలనా చూడాల్సిన వార్డెన్ దారి తప్పాడు. మద్యం తాగిన తర్వాత సైకోలా మారిపోతున్నాడు. విద్యార్థులను గదికి రప్పించుకుని బట్టలూడదీయించి నరకం చూపిస్తున్నాడు. ఎవరికైనా చెబితే మరింత పనిష్మెంట్ ఉంటుందని బెదిరించి శాడిజం ప్రదర్శిస్తున్నాడు. చివరకు విద్యార్థుల నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- కార్పొరేట్ హాస్టల్ వార్డెన్ అరాచకం...
- మద్యం మత్తులో విద్యార్థులపై దాష్టీకం
- తన గదినే బార్‌గా మార్చేసిన ఘనుడు



బార్‌ను తలపిస్తున్న హాస్టల్ వార్డెన్ గది



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం కొడిమి సమీపంలో సంసిద్ ఇంటర్నేషనల్ (సబీఎస్ఈ) స్కూల్ నిర్వహిస్తున్నారు. స్కూల్ ఆవరణలోనే హాస్టల్ కూడా ఉంది. విజయశంకర వరప్రసాద్ అనే వ్యక్తి హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. ఈయన వార్డెన్ విధులను పక్కన పెట్టి ఒక సైకోలా ప్రవర్తిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఇతను తన గదిని బార్‌లా మార్చేశాడు. బయటి నుంచి మద్యం తెచ్చుకోవడం గదిలోనే పూటుగా తాగడం.. ఆ మత్తులో రోజూ కొంతమంది విద్యార్థులను గదికి రప్పించుకుని వికృత చేష్టలకు పాల్పడటం పరిపాటిగా మార్చుకున్నాడు. వార్డెన్ దెబ్బలకు తట్టుకోలేక కొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు, పటిష్ట నిఘాతో కూడిన పర్యవేక్షణ ఉంటుందని పంపితే వార్డెన్ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటంపై తల్లిదండ్రులు రగిలిపోయారు. ఆదివారం రాత్రి డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు హాస్టల్ వద్దకు వస్తున్న విషయం తెలుసుకున్న వార్డెన్ అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు వార్డెన్ గదిని తనిఖీ చేయగా అక్కడ తాగి పడేసిన మద్యం బాటిళ్లు వందల సంఖ్యలో కనిపించాయి.

వార్డెన్‌పై కేసు నమోదు..

విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వార్డెన్ విజయశంకర్ వరప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. వార్డెన్ పరారీలో ఉన్నాడన్నారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని రంగంలోకి దింపామని చెప్పారు.

యాజమాన్యానికి నోటీసులు..

విద్యార్థులపై సంసిద్ స్కూల్ హాస్టల్ వార్డెన్ అకృత్యాలకు పాల్పడినట్లు సమాచారం అందడంతో డీఈఓ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు సోమవారం స్కూలు కెళ్లి విచారణ చేపట్టారు. వార్డెన్ ప్రవర్తనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్కూలు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు.

స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి..

సంసిద్ ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ సంసిద్ స్కూల్ హాస్టల్ వార్డెన్ నిత్యం మద్యం తెచ్చుకుని తాగుతున్నాడన్నారు. మద్యం మత్తులో విద్యార్థులను విచక్షణారహితంగా చావబాదుతున్నాడన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, మంజు, పవన్, హరి, విశ్వ, రారాజు, శామ్యూల్, సిద్దు, గిరి, భీమేష్, సోము, చంద్రకాంత్, నందన్ పాల్గొన్నారు.

‘అనంత’ అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ మృతి



రాజశేఖర్‌రెడ్డి (ఫైల్)

వజ్రకరూరు: అనంతపురం జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి (67) మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. అదే రోజు సాయంత్రం స్వగ్రామమైన వజ్రకరూరు మండలం కమలపాడుకు తీసుకొచ్చారు. రాజశేఖర రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేశారు. 2022లో అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా చైర్మన్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించారు. భార్య టి.శైలజారెడ్డి 2006 నుంచి 2011 వరకు వజ్రకరూరు ఎంపీపీగా పనిచేశారు. వీరికి ఇద్దరు కుమారులు సందీప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి ఉన్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కమలపాడులో రాజశేఖర్‌రెడ్డి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖుల నివాళి..

జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి మరణ వార్త వైఎస్సార్‌సీపీ నేతలను దిగ్భ్రాంతికి గురి చేసింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు కమలపాడుకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్ ద్వారా రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తోపుదుర్తి కవిత, పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

జనవాక్కు

రైతులను ఆదుకున్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు మంచి రోజులు వచ్చాయి. వ్యవసాయం చేసుకోవడానికి ‘రైతు భరోసా’ పథకం ఎంతో దన్నుగా ఉంటోంది. గతంలో పంటల సాగుకు పెట్టుబడి కూడా లేక అనేక ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ఖరీఫ్ సీజన్ మొదలైనపుడు రూ. 5,500, రెండో విడతలో రూ. 2 వేలు చొప్పున మొత్తం రూ. 7,500 రైతుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. దీంతో సాగు ఎంతో సులభతరంగా మారింది. ఆర్‌బీకేల్లో ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచడంతో ఇబ్బందులు తప్పాయి. సబ్సిడీ వేరుశనగ పంపిణీ మా పంచాయతీలోనే చేపడుతుండడంతో వ్యయ ప్రయాసాలు తగ్గాయి. రైతులకు మేలు చేస్తున్న సీఎం జగన్‌కే మా మద్దతు.

– నరసింహారెడ్డి, కుర్లపల్లి, లేపాక్షి మండలం

కన్న బిడ్డలా ఆదరిస్తున్నారు



కడుపున పుట్టిన బిడ్డలు కూడా పట్టించుకోని ఈ రోజుల్లోనూ సీఎం జగన్ ఎంతో పెద్ద మనసుతో మమ్మల్ని ఆదరిస్తున్నారు. వృద్ధులకు ప్రతి నెలా పింఛన్ అందజేసి ఆదుకుంటున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పెన్షన్ నగదు పెంచారు. రూ. 2,250 నుంచి ప్రారంభించి రూ.3,000కు తీసుకురావడం ఆనందంగా ఉంది. గతంలో పింఛన్ పొందాలంటే ఎన్నో అవస్థలు పడేవాళ్లం. పంచాయతీ కార్యాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉండేవాళ్లం. నేడు ఆ బాధలన్నీ తప్పాయి. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తారీఖునే ఇంటికే వచ్చి డబ్బు అందిస్తూ సంతోషం పంచుతున్నారు.

– తిమ్మక్క, పళారం, గుడిబండ మండలం

రూ.2.48 లక్షల లబ్ధి చేకూరింది



కరోనా సమయంలో పను లేక పూట గడవక నానా ఇబ్బందులు పడ్డాం. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మమ్మల్ని ఆదుకున్న తీరు ఇప్పటికీ మరువలేకున్నాం. ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి అన్ని రకాల సేవలు అందజేశారు. ఉచిత బియ్యం అందజేసి మా ఆకలి తీర్చారు. అవసరమైన మందులు తెచ్చిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పథకాల ద్వారా మా కుటుంబానికి రూ.2,48,500 లబ్ధి చేకూరింది. ఇందుకోసం ఏ ఒక్కరినీ ప్రాధేయపడలేదు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. మా అవసరాలు ఏమిటో వలంటీర్ల ద్వారా అడిగి తెలుసుకుని తీరుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమెంతో రుణపడి ఉన్నాం. ఆయనకే మా మద్దతు.

– పెద్దింటి గౌరమ్మ, రంగవేడు, గుమ్మఘట్ట మండలం

బొలెరో బోల్తా



రోడ్డుపై బోల్తా పడిన బొలెరో వాహనం

బత్తలపల్లి: మండల పరిధిలోని బత్తలపల్లి రైస్ మిల్లు సమీపంలో అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై సోమవారం బొలెరో అదుపుతప్పి బోల్తా పడింది. వైఎస్సార్ జిల్లా పార్నపల్లి నుంచి కర్ణాటకలోని బీజాపూర్‌కు అరటి పండ్ల లోడుతో వెళ్తున్న బొలెరో బత్తలపల్లి రైస్‌మిల్లు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి బోల్తా పడింది. ప్రమాదం నుంచి డ్రైవర్ మధు, సందీప్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డుపై బొలెరో అడ్డంగా బోల్తా పడడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బంది ఆంజనేయులు, గోపాల్‌ను సంఘటనాస్థలానికి పంపించారు. వారు స్థానికుల సాయంతో వాహనాన్ని తొలగించారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పానీ పూరీ తినిపిద్దామని వచ్చి.. పరలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



శివనాయక్ (ఫైల్)

గోరంట్ల: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మండల పరిధిలోని గుంతపల్లి సమీపంలో పుట్టపర్తి -గోరంట్ల ప్రధాన రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గడ్డం తండాకు చెందిన శివనాయక్ (32), చక్రీబాయి భార్యాభర్తలు. వీరికి దేవాంశనాయక్, అశ్వినీబాయి సంతానం. పిల్లలకు పానీపూరీ తినిపించేందుకు సోమవారం సాయంత్రం బైకుపై శివనాయక్ గోరంట్ల వచ్చాడు. తిరిగి తండాకు వెళ్తుండగా, గుంతపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శివనాయక్‌ను స్థానికులు 108లో గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హిందూపురం ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్తుండగా, మార్గమధ్యలోనే శివనాయక్ ప్రాణాలు విడిచాడు. తండ్రితో పాటు ఉన్న చిన్నారులు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సెల్ఫీ వీడియో తీసి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో కృష్ణ

ధర్మవరం అర్బన్: కుటుంబ కలహాలతో మున్సిపల్ అటెండర్ కృష్ణ ఆత్మహత్యాయత్నం చేశాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే కృష్ణ సోమవారం ఆత్మహత్య చేసుకుంటున్నానని సెల్ఫీ వీడియో తీశాడు. తన కుటుంబ సమస్యలకు తెలియజేశాడు. అనంతరం స్నేహితులకు పంపి వాజ్‌మోల్ తాగాడు. గమనించిన మున్సిపల్ సిబ్బంది అతనిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చిలమత్తూరు: మండలంలోని కొడికొండ – కందుర్పర్తి మార్గంలోని పొలాల్లో కల్లుకుంటకు చెందిన వెంకటేష్ (40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గంగాధర్ సంఘటనా స్థలానికి చేరుకున్న మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి బంధువులు సాధారణ మరణం అని చెప్పారని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడని తెలిపారని ఎస్ఐ పేర్కొన్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఆరుగురు ఎస్ఐల బదిలీ

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆరుగురు ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ సోమవారం రాత్రి ఎస్పీ మాధవరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అమరాపురంలో ఉన్న వెంకటేశ్వర్లును రామగిరికి, పుట్టపర్తి అర్బన్‌లో ఉన్న వీరేష్‌ను అగళికి, పుట్టపర్తి డీటీసీలో ఉన్న కృష్ణవేణిని గాండ్లపెంటకు, కొత్తచెరువులో ఉన్న సురేష్‌బాబును బుక్కపట్నంకు, ముదిగుబ్బలో ఉన్న వంశీకృష్ణను ఓడీసీకి, నల్లమాడలో ఉన్న వరలక్ష్మిని పుట్టపర్తిలోని దిశ పీఎస్‌కు బదిలీ చేశారు.

ముదిగుబ్బ సీఐగా కృష్ణమ రాజునాయక్

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం పలువురు సీఐలను బదిలీ చేస్తూ సోమవారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా వీఆర్(అనంతపురం)లో ఉన్న కృష్ణమ రాజు నాయక్‌ను ముదిగుబ్బ సర్కిల్‌కు, ముదిగుబ్బ సర్కిల్‌లో ఉన్న సీఐ యతీంద్రను ముదిగుబ్బ యూపీఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పెళ్లి పేరుతో వాడుకుని వదిలేశాడు

- ఎస్పీకి యువతి ఫిర్యాదు
- న్యాయం చేయాలని వేడుకోలు
- ‘స్పందన’కు 41 అర్జీలు



అర్జీల పరిష్కారంపై సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

పుట్టపర్తి టౌన్: పెళ్లి చేసుకుని యువతిని లోబరుచుకున్న ఓ మాయగాడు ఆ తర్వాత మొహం చాటేశాడు. దీంతో బాధితురాలు న్యాయం చేయాలంటూ జిల్లా ఎస్పీ మాధవ రెడ్డిని ఆశ్రయించింది. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ‘స్పందన’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సదరు యువతి ఎస్పీ ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. వివరాలు.. పుట్టపర్తి పట్టణానికి చెందిన యువతి డిగ్రీ పూర్తి చేసింది. బతుకుదెరువు కోసం స్థానిక గోకులం వద్ద ఉన్న సాయిసేవా ఆఫీసులో డేటా ఎంట్రీగా పనిచేస్తోంది. తమ ఇంటి పక్కన ఉన్న సత్యనారాయణ కుమారుడు యశ్వంత్‌తో ఆమెకు 3 సంవత్సరాల క్రితం పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. పెద్దలకు తెలియకుండా గత ఏడాది జూలైలో ఆమెకు యశ్వంత్ తాళి కట్టాడు. శారీరకంగా లోబరచుకున్నాడు. తనను ఇంటికి తీసుకెళ్లాలని నాలుగు రోజుల క్రితం యశ్వంత్‌ను యువతి కోరింది. దీనికి అతడు నిరాకరించాడు. యువకుడి ఇంటికి వెళ్తే వారి తల్లిదండ్రులు దౌర్జన్యం చేశారు. బాధితురాలిని యువకుడి సోదరుడు అశోక్ చక్రవర్తి చంపుతామంటూ బెదిరించాడు. తీవ్రంగా కొట్టారు. చేసేదేమీ లేక ఆ యువతి ఎస్పీ మాధవరెడ్డిని ఆశ్రయించింది. పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టాలని వెళ్తే యశ్వంత్ మేనమామ అయిన ఏఎస్ఐ ఓబుళపతి అడ్డుకున్నాడని ఆరోపించింది. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసింది. సమస్య విన్న అనంతరం పుట్టపర్తి అర్బన్ పోలీసు అధికారులకు ఎస్పీ మాధవ రెడ్డి ఫోన్ చేశారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

‘స్పందన’లో 41 అర్జీలు..

పోలీసు స్పందన కార్యక్రమంలో 41 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను ఎస్పీ మాధవరెడ్డి సావధానంగా విన్నారు. అనంతరం సంబంధిత పోలీసుస్టేషన్ల అధికారులతో మాట్లాడారు. నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే పరిష్కారం చూపాలని ఆదేశించారు.

ప్రమాదంలో యువకుడి మృతి

గుత్తి: ద్విచక్ర వాహనం బోల్తాపడిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తిలోని ఎస్‌బీఐ కాలనీకి చెందిన కిరణ్ (23)కు భార్య కవిత, ఏడాది వయసున్న కుమార్తె ఉన్నారు. పార్ట్‌టైమ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన స్నేహితుడు మల్లేష్‌తో కలసి శివమాల ధరించేందుకు ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై నంద్యాల జిల్లా యాగంటికి బయలుదేరారు. ప్యాపిలి సమీపంలో మలుపు వద్దకు చేరుకోగానే వేగ నియంత్రణ కోల్పోవడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌కు రెండు కాళ్లూ విరిగాయి.